# విజయనగర యుగ విశేషాలు

క్రీ.శ.1336లో హరిహర, బుక్కరాయలు ప్రారంభించిన విజయనగర సామ్రాజ్యాన్ని సంగమ, సాళువ, తుళువ, అరవీడు వంశాలు క్రీ.శ.1680 వరకు పాలించాయి. విజయనగర పాలకులు సమర్థవంతమైన పాలనా విధానాన్ని ప్రవేశపెట్టడమే కాకుండా ఆర్థిక, సామాజిక, మత, సాంస్కృతిక రంగాల అభివృద్ధికి కృషి చేశారు. సామ్రాజ్యాన్ని రాష్ట్రాలు, మండలాలు, నాడులు, స్థలాలు, సీమలు, గ్రామాలుగా విభజించారు. హైందవమత సంస్కృతిని రక్షించారు. ఆముక్త మాల్యద, పరాశర మాధవీయం, సకల నీతి సమ్మతం లాంటి గ్రంథాల్లో విజయనగర కాలం నాటి పాలనా విశేషాల ప్రస్తావన కనిపిస్తుంది.

విజయనగర కాలంలో ప్రధానమంత్రి అధ్యక్షతన ఉండే మంత్రిమండలి రాజుకు పాలనలో సహాయపడేది. ప్రధానమంత్రిని సభానాయక, తంత్రనాయక అని పిలిచేవారు. సమావేశాలు సభా భవనాల్లో జరిగేవి.

★ రెండో దేవరాయల సభా భవనాన్ని మలయకుటం లేదా ముత్యాలశాల అని, శ్రీకృష్ణదేవరాయల సభా భవనాన్ని భువన విజయం అని, అచ్యుత రాయల సభా భవనాన్ని వెంకట విలాస మంటపం అని పిలిచేవారు. ప్రభుత్వ నిర్వహణకు అట్టావన (రెవెన్యూ శాఖ), కందాచార (సైనిక శాఖ), భాండార (ఖజానా శాఖ), ధర్మాసన (న్యాయ శాఖ) లాంటి శాఖలుండేవి.

★ ప్రతి శాఖకు సంప్రతులు అధిపతులుగా ఉండేవారు. సంప్రతులు సీమలు, స్థలాలు, పొలిమేరల గురించి, వాటిలోని భూ కామందుల గురించి, శిస్తు గురించి చిట్టాలు తయారు చేసేవారు. రాష్ట్రాల అధికారులను దుర్గదన్నాయకుడు అని, అతని కార్యస్థానాన్ని చావడి అని పిలిచేవారు. సీమ అధిపతిని పారుపత్యదారు అనేవారు. స్థలాలకు అధిపతులుగా రెడ్డి, గౌడ లేదా స్థలకరణాలు ఉండేవారు. గ్రామ పాలనకు ఆయగాండ్రు అనే 12 మంది ఉద్యోగులుండేవారు. వీరు ప్రజల నుంచి పంటలో కొంత భాగం మేరగా పొందేవారు.

★ న్యాయస్థానాలను ముద్రిత, శాస్త్రిత అని పేర్కొనేవారు. ప్రధానమంత్రి ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించేవాడని అబ్దుల్ రజాక్ పేర్కొన్నాడు. న్యాయ నిర్వహణలో దివ్య పరీక్షలు అమల్లో ఉండేవని నికోలోకాంటె వ్యాఖ్యానించాడు. నాటి గ్రామాల్లో భాండార వాడలు, అమర గ్రామాలు, మాన్య గ్రామాలు అనే మూడు రకాల గ్రామాలుండేవి. మాన్య గ్రామాలు జోడి అనే పన్నును చెల్లించేవి. ప్రభుత్వానికి చేసిన సేవలకు ప్రతిఫలంగా ఇచ్చే గ్రామాలను ఉబ్బలి గ్రామాలు అనేవారు.

## పన్నులు

విజయనగర యుగంలో పన్నుల భారం అధికంగా ఉండేది. శ్రీకృష్ణదేవరాయల కొండవీడు శాసనం 59 రకాల వస్తువులపై ఉన్న పన్నులను ప్రస్తావించింది. సువర్ణ రూపంలో వచ్చే (స్వర్ణకారులు చెల్లించే) ఆదాయాన్ని సిద్ధాయం అనేవారు. సాలెవారు పింజసిద్ధాయం, మగ్గరి పన్నులు చెల్లించేవారు. వివిధ వృత్తులవారు జాతి సిద్ధాయం అనే పన్ను చెల్లించేవారు. పశువులను మేపుకున్నందుకు పచ్చిక బయళ్లపై పుల్లరి అనే పన్ను చెల్లించేవారు. బిచ్చగాళ్లపై వసూలు చేసేది గణాచారి పన్ను. పెళ్లి సమయంలో కల్యాణకానికె/ గుడికల్యాణం అనే పన్ను చెల్లించేవారు. చెరువు నీరు వాడుకున్నందుకు పన్ను కింద 1/10 వ వంతు 'దశబంధ మాన్యం' అనే పేరుతో చెల్లించేవారు. వ్యవసాయేతర, వృత్తి పన్నులను శుల్కాదాయం అనేవారు.

★ నాగులాపురంలో ప్రవేశించే వస్తువులపై 42 వేల పగోడాల ఆదాయం వచ్చేదని డొమింగో పెయిజ్ తన రచనల్లో పేర్కొన్నాడు. కొండోజు అనే మంగలి విజ్ఞప్తి మేరకు అళియ రామరాయలు మంగలి పన్నును రద్దు చేశాడు. వైవాహిక సుంకాన్ని రద్దు చేసిన తొలి విజయనగర రాజుగా తుళువ వీరనరసింహుడు పేరొందాడు. శ్రీకృష్ణదేవరాయలు కూడా కందనవోలు (కర్నూలు), చంద్రగిరి ప్రాంతాల్లో వైవాహిక సుంకాన్ని తొలగించాడు. టోకు వర్తకులు హెర్జుంకం అనే పన్ను చెల్లించేవారు.

★ నాటి ప్రధాన బంగారు నాణెం గద్యాణం. దీన్నే వరహా అనేవారు. ప్రతాప, ఫణం, చిన్నం అనే బంగారు నాణేలు కూడా ఉండేవి. ఎక్కువగా ప్రజాబాహుళ్యంలో వాడుకలో ఉన్న బంగారు నాణెం ఫణం. తార్ అనేది నాటి వెండి నాణెం కాగా, జటాలు, కాసు అనేవి రాగి నాణేలు. దీనారం అనే ఈజిప్షియన్ నాణెం కూడా వాడుకలో ఉండేది.

### సాంఘిక పరిస్థితులు

విజయనగర కాలంలో చాతుర్వర్ణ వ్యవస్థ ఉండేదని డొమింగో పెయిజ్ పేర్కొన్నాడు. బ్రాహ్మణ ఆధిక్యత ఉండేది. క్షత్రియ స్త్రీలు సతీసహగమనం చేసేవారని, నరబలి ఆచారం ఉండేదని బార్బోసా పేర్కొన్నాడు. గ్రామీణ పేదరికం, ప్రజల అర్ధ నగ్న జీవితాల గురించి కూడా అతను వివరించాడు. సామ్రాజ్యంలో జరిపే దీపావళి, నవరాత్రి ఉత్సవాల గురించి నికోలోకాంటె పేర్కొన్నాడు. విజయనగరం

లాంటి పట్టణం ప్రపంచంలో ఉండదని, ఇక్కడ వజ్రాలు రాసులుగా పోసి అమ్మేవారని, వేశ్యావృత్తికి ప్రభుత్వ గుర్తింపు ఉందని అబ్దుల్ రజాక్ పేర్కొన్నాడు. వేట, కుస్తీ పోటీలు, తోలుబొమ్మలాట, వీధినాటకం, యక్షగానం, చదరంగం లాంటివి నాటి ముఖ్య వినోదాలని కూడా రజాక్ పేర్కొన్నాడు. దేవదాసీ వ్యవస్థ, బ్రాహ్మణ ఆధిక్యత, చాతుర్వర్ణ వ్యవస్థ లాంటి వాటి గురించి డొమింగో పెయిజ్ పేర్కొన్నాడు. విజయనగరాన్ని రోమ్ పట్టణంతో పోల్చింది డొమింగో పెయిజ్. అచ్యుత రాయల కాలంలో వచ్చిన న్యూనిజ్ భూస్వాములు, ప్రభువుల శృంగార ప్రియత్వం గురించి, తెలుగువారిలో ఉన్న సతీసహగమన ఆచారం గురించి పేర్కొన్నాడు. విజయనగర యుగంలో అత్యంత అద్భుతంగా చేసే పండుగ దసరా (విజయదశమి). నాటి ఆర్థిక సంవత్సరం కూడా మహార్నవమితో ప్రారంభమయ్యేది. ఈ యుగంలోనే పంచమ కులస్థులు ఏర్పడ్డారు. మాల, మాదిగ, వలయ, చక్కిలి, పరయ కులాల వారినే పంచములు అనేవారు. పంచములు కూడా దేవుడి పూజకు అర్హులే అని శ్రీకృష్ణదేవరాయలు "మాలదాసరి కథ"లో వివరించారు. సాలెవారిని కైకోలులు అని, గారడీ విద్యలు ప్రదర్శించేవారిని విప్రవినోదులు అని, వ్యవసాయదారులను వక్కలి లేదా వెల్లాలు అని, పశుకాపరులను ఇదయనులు, కురుబలు అని పిలిచేవారు. కుల కట్టుబాట్లు పాటించని వారిపై సమయ సుంకం విధించేవారు.

## సైనిక, న్యాయపాలన

చక్రవర్తి అత్యున్నత న్యాయాధికారి. ముద్రిత, శాస్త్రిత అనే న్యాయస్థానాలు ఉండేవి. పరాశర మాధవీయం గ్రంథం నాడు నాలుగు రకాల న్యాయస్థానాలు ఉండేవని పేర్కొంటోంది. న్యాయ నిర్వహణ బాధ్యతను ప్రధానమంత్రి నిర్వహించేవాడని అబ్దుల్ రజాక్ పేర్కొన్నాడు. న్యాయ నిర్వహణలో ప్రాడ్వివాక్కులు అనే ఉద్యోగులు సహాయపడేవారు. నేర నిరూపణకు దివ్య పరీక్షలు అమల్లో ఉన్నట్లు నికోలోకాంటె తన రచనల్లో పేర్కొన్నాడు. శాంతి భద్రతల పర్యవేక్షణకు గ్రామంలో తలారి, స్థలాల్లో కావలివారు, పర్వతారణ్య సరిహద్దు ప్రాంతాల్లో పాలెగార్లు బాధ్యత వహించేవారు. ఆయగాండ్రకు ఈనాములు లేదా మిరాసీలు, పాలెగార్లకు జాగీర్లు ఇచ్చేవారు.

★ సైనిక శాఖను కందాచార శాఖ అనేవారు. సిద్ధ సైన్యం, కైజీత సైన్యం అనే రెండు విభాగాలుండేవి. సైనిక విధానాన్ని అమరనాయక పద్ధతి అనేవారు. అమరం అంటే నిర్ణీత భూభాగంపై శిస్తు వసూలు అధికారం. శ్రీకృష్ణదేవరాయల కాలంలో తిమ్మోజు నౌకాదళాధిపతిగా ఉండేవాడు. శత్రువులపై రాళ్లు రువ్వే దంబోళి అనే యుద్ధపరికరం నాడు ప్రసిద్ధికెక్కింది. అచ్యుత రాయల కాలంలో 6 లక్షల అమరనాయక సైన్యం ఉండేదని న్యూనిజ్ పేర్కొన్నాడు.

## మతపరిస్థితులు

అధికార మతం వైష్ణవం. రాజుల పరమత సహనం గురించి బార్బోసా పేర్కొన్నాడు. శ్రీరంగంలో వైష్ణవ, జైన మత ఘర్షణలను మొదటి బుక్కరాయలు నివారించాడు. రెండో దేవరాయలు ముస్లింలకు, జైనులకు ప్రార్థనా సౌకర్యాలు కల్పించాడు. శ్రీశైలంలో శాంత లింగప్ప అనే వ్యక్తి జైనమతం వారిని హింసిస్తుంటే శ్రీకృష్ణదేవరాయలు వెలుగోటి గని తిమ్మానాయుడిని పంపి, అతడిని శిక్షించాడు. అళియరామ రాయలు రాజధానిలోని తురకవాడలో గోవధను అనుమతించాడు. సంగమ వంశస్థుల కుల దైవం విరూపాక్ష స్వామి. కుల గురువు క్రియాశక్తి ఆచార్యులు. శృంగేరి స్మార్త గురుపీఠంగా ప్రాచుర్యం పొందింది. తుళువ వంశ పాలనాకాలం నుంచి వైష్ణవం రాజాదరణ పొందింది. శ్రీకృష్ణదేవరాయల ఆస్థానాన్ని వల్లభాచార్యుడు సందర్శించారు. మధ్వాచార్యులు గోదావరి తీరంలో పర్యటించారు. నరహరి తీర్థులు శ్రీకూర్మం కేంద్రంగా ద్వైతమతాన్ని ప్రచారం చేశారు. సాళువ నరసింహుని గురువు వ్యాసతీర్థులు నాటి ప్రసిద్ధ ద్వైత మతాచార్యులు. శ్రీకృష్ణదేవరాయల మతగురువు తాతాచార్యులు. రెండో వెంకటపతిరాయలు తన ఆస్థానంలో అయ్యప్ప దీక్షితుడిని (అద్వైతం) పోషించాడు. ఇతడి కాలం నుంచే శాసనాల్లో విరూపాక్షుడి బదులు వేంకటేశ్వరుని పేరు ఉపయోగించారు. అతడి నాణేలపై శ్రీ వేంకటేశాయ నమః అని రాసి ఉండటం కనిపిస్తుంది. కడప జిల్లాలోని పుష్పగిరి వద్ద శృంగేరి స్మార్త మఠ శాఖ ఏర్పడింది. ఆంధ్ర దేశంలోని ఏకైక అద్వైత కేంద్రం పుష్పగిరి. శ్రీకూర్మం, మంత్రాలయం నాటి ప్రసిద్ధ అద్వైత కేంద్రాలు. పెనుగొండ ప్రసిద్ధ జైన క్షేత్రం. ఇస్లాం మత కేంద్రంగా మాబార్ (మధురై) ప్రసిద్ధి చెందింది. చంద్రగిరి, వెల్లూరులో క్రైస్తవులు చర్చిలు నిర్మించుకున్నారు. స్మార్త మతస్థులు పంచాయతన దేవతలకు కుమారస్వామిని చేర్చి షణ్మతావిధానాన్ని పాటించారు. మధ్వాచార్యుని వల్ల హనుమంతుని పూజకు ఆదరణ పెరిగింది. నవరాత్రుల్లో జంతుబలి గురించి పెయిజ్, శివరాత్రి ఆచారాల గురించి నికోలోకాంటె ప్రస్తావించారు. తిరుపతికి వెళ్లే భక్తుల వింత మొక్కుల గురించి తరిగొప్పుల మల్లన్న తన చంద్రబాను చరిత్ర గ్రంథంలో వివరించాడు.

## సాంస్కృతిక అంశాలు

రాయల కాలంలో భాష, సాహిత్యం, కళలు ఎంతో అభివృద్ధి చెందాయి. తెలుగు, సంస్కృతం, కన్నడ భాషల్లో అనేక గ్రంథాలు ప్రచురితమయ్యాయి. సంగీతం, సాహిత్యం, శిల్పం, వాస్తుకళా రంగాలు అభివృద్ధి చెందాయి. నాటి అధికార భాష సంస్కృతం. శ్రీకృష్ణదేవరాయలు తన ఆస్థానంలో అష్టదిగ్గజాలు పేరుతో కవి పండితులను పోషించాడు.

**విద్యారణ్యస్వామి రచనలు:** ఐతరేయ దీపిక, తైతరేయ దీపిక, పంచదశిక, జీవన్ముక్తి వివేక

**మాధవాచార్యుడు:** పరాశర మాధవీయం, జైమినీ న్యాయమాల విస్తార, సర్వదర్శన సంగ్రహ

**శాయణుడు:** వేదార్థ ప్రకాశిక, ధాతువృత్తి

**వేదాంత దేశికుడు:** తాత్పర్య చంద్రిక, తత్వటీక, యాదవాభ్యుదయం

★ అయ్యప్పదీక్షితులు - శైవార్కమణిదీపిక

★ మాధవమంత్రి - శైవామ్నాయ సారం

★ రెండో దేవరాయలు - మహానాటక సుధానిధి

★ గంగాదేవి - మధురా విజయం

★ ఉద్దండ కవి - మల్లికా మారుతం (నాటకం)

★ తిరుమలాదేవి - వరదాంబికా పరిణయం

★ తాళ్లపాక తిమ్మక్క - సుభద్రా కల్యాణం

★ మోహనాంగి - మరీచి పరిణయం

★ అరుణగిరినాథ డిండిముడు - సోమవల్లీ యోగానంద ప్రహసన

★ రెండో రాజనాథ డిండిముడు - సాళువాభ్యుదయం

★ మూడో రాజనాథ డిండిముడు - అచ్యుత రామాభ్యుదయం

★ శ్రీకృష్ణదేవరాయలు సంస్కృత భాషలో జాంబవతీ పరిణయం, మదాలస చరిత్ర, ఉషా పరిణయం, సకల కథాసార సంగ్రహం, జ్ఞాన చింతామణి లాంటి రచనలు చేశారు.

## తెలుగు భాష

తెలుగు భాషా చరిత్రలో విజయనగర యుగం స్వర్ణయుగం. దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు ప్రచారం చేశాడు. ఆముక్తమాల్యద (విష్ణుచిత్తీయం) గ్రంథాన్ని తెలుగు భాషలో రాశాడు. అష్టదిగ్గజ కవులు, నాచన సోముడు, దగ్గుపల్లి దుగ్గన, ప్రోలుగంటి చెన్నమంత్రి, పిల్లలమర్రి పినవీరభద్రుడు లాంటి తెలుగు కవులు అనేక రచనలు చేశారు. నాచన సోముడు ఉత్తర హరివంశం గ్రంథాన్ని రాసి, హరిహరదేవుడికి అంకితం చేశాడు. దూబగుంట నారాయణ కవి తెలుగు భాషలో పంచతంత్రం గ్రంథాన్ని రచించాడు.

## వాస్తు, కళారంగాలు

నాటి ప్రధాన వాద్య పరికరం - వీణ. క్షేత్రయ్య మొవ్వ గోపాల పదాలు రాశారు. కూచిపూడి భాగవతులు ప్రాచుర్యం పొందారు. విరూపాక్ష/ పంపావతి ఆలయం అతిపెద్దదిగా పేరుగాంచింది. విఠలస్వామి దేవాలయంలో ఏకశిలా రథం, సంగీత స్తంభాలు ఉన్నాయి. ఫెర్గసన్ లాంటి విదేశీ రాయబారులు ఈ ఆలయ గొప్పతనాన్ని ప్రశంసించారు. లేపాక్షి నాటి చిత్రలేఖనాలకు ప్రసిద్ధి.

★ తాడిపత్రి ఆలయంలో కూడా ఏకశిలా రథం కనిపిస్తుంది. తాడిపత్రిలో చింతల వెంకటరమణ ఆలయం ఉంది. లేపాక్షి, సోమపాలెం, హంపి, తాడిపత్రిల్లో చిత్రలేఖనాలున్నాయి. పద్మమహల్‌ను ఇస్లామిక్ పద్ధతిలో నిర్మించారు.

## ఆర్థిక పరిస్థితులు

ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. రాజ్యానికి భూమి శిస్తు ప్రధాన ఆదాయవనరు. వీరి కాలంలో వ్యవసాయ, వాణిజ్య, పరిశ్రమల రంగాలు అభివృద్ధి చెందాయి. కేసరిపాటిగడ, దోరగడ లాంటి పరికరాలతో భూములను సర్వే చేసేవారు. మాగాణి భూములను నీరాంబర భూములని, మెట్టభూములను కాడాంబర భూములని పేర్కొనేవారు.

★ నాడు భూమి శిస్తు 1/3 వ వంతుగా ఉండేది. బ్రాహ్మణ ఈనాములపై 1/6 వ వంతు, దేవాలయ భూములపై 1/30 వ వంతు పన్ను వసూలు చేసేవారు. వ్యవసాయాభివృద్ధికి చెరువులు, కాలువలు తవ్వించారు. నాటి చెరువుల గురించి కడప జిల్లాలో

లభించిన కోరుమామిళ్ల శాసనం వివరిస్తోంది. పెనుగొండ వద్ద మొదటి బుక్కరాయలు శిరువేరు తటాకాన్ని, అనంతపురం వద్ద నరసింహరాయలు నరసాంబుధి తటాకాన్ని, నాగులాపురంలో శ్రీకృష్ణదేవరాయలు నాగులాపురం చెరువును తవ్వించారు. కొండవీటి రాజ్యంలో కొండమరసు తిమ్మసముద్రం, కొండసముద్రం చెరువులను తవ్వించాడు. దేశమంతటా తోటలు విస్తారంగా ఉండేవని, పండ్లు చవకగా లభించేవని డొమింగో పెయిజ్ పేర్కొన్నాడు. వ్యవసాయ సంబంధ పరిశ్రమలు ఎక్కువగా ఉండేవి.

★ తాడిపత్రి, ఆదోని, గుత్తి, వినుకొండ నూలు పరిశ్రమకు ప్రధాన కేంద్రాలు. వజ్రకరూర్ గనులు వజ్రాలకు ప్రసిద్ధి చెందాయి. నకిలీ వజ్రాలు కూడా తయారు చేసేవారని బార్బోసా పేర్కొన్నాడు. గ్రామాల్లో జరిగే స్థానిక సంతల గురించి ఆముక్తమాల్యద గ్రంథంలో పేర్కొనగా, సాయంత్రం సంతల్లో అమ్మే వివిధ వస్తువుల గురించి డొమింగో పెయిజ్ రాశాడు. నాటి వర్తక, వ్యాపార కేంద్రాల గురించి హంసవింశతి గ్రంథం వివరిస్తోంది.

★ విజయనగరంలో 300 ఓడరేవులున్నాయని అబ్దుల్ రజాక్ పేర్కొన్నాడు. మోటుపల్లి రేవు గురించి కొండవీడు, విజయనగర రాజ్యాలు సుదీర్ఘ పోరాటం చేశాయి. మొదటి దేవరాయలు మోటుపల్లి అభయ శాసనం (1416) వేయించాడు. పులికాట్ రేవులోని ఎగుమతులు, దిగుమతుల గురించి, హిందూ-ముస్లిం వర్తకుల గురించి బార్బోసా వివరించాడు. నాడు పులికాట్ ముఖ్య నౌకా నిర్మాణ కేంద్రంగా ఉండేది. వర్తక కేంద్రాలను నకరములు అనేవారు.

**రచయిత: బి. నాగరాజు**

www.eenadupratibha.net

www.eenadupratibha.net